



పేరెట్టి ముద్దుగా పిలిచెట్టు

తాటిచెట్లకు ఆసక్తికర పేర్లు

గీత కార్మికులు, కల్లు ప్రియుల వినూత్న నామకరణ సంస్కృతి

రుచి, ఆకృతి, స్థలాన్ని బట్టి విభిన్న నామధేయాలు

పటేల్‌తాడు, కోడెనాగు, బంగారు తీగ.. ఎన్నో పేర్లు

7

గీతకార్మికులు, కల్లు ప్రియులు తాటిచెట్లకు పెట్టిన ఆసక్తికరమైన పేర్ల గురించి వింటే ఆశ్చర్యపోవాల్సిందే. సాధారణంగా మనుషులకు జన్మ నక్షత్రం, పుట్టిన సమయాన్ని బట్టి పేర్లు పెట్టినట్లుగానే, తరతరాలుగా తాటి చెట్లకు వాటి ఆకృతి, స్థలం, కల్లు రుచిని బట్టి తీరొక్క పేర్లు పెట్టి పిలుస్తున్నారు. దేవుళ్లు, సినిమాలు, పలు కులాలు, భూయజమానుల పేరిట పిలుస్తుంటారు. ఈ విలక్షణ సంస్కృతి దుబ్బాక మండలంలోనే కాకుండా, గీత కార్మికులు, కల్లు ప్రియులు ఉండే చాలా ప్రాంతాల్లో కనిపిస్తూ ఉంటుంది.



నేడు కోహెడలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుల సంస్మరణ సభ

కోహెడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : చత్తీస్‌గడ్ రాష్ట్రంలో సెప్టెంబరు 22న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కోస దాదా అలియాస్ కదారి సత్యనారాయణరెడ్డి, రాజు దాదా అలియాస్ వికల్ప్, ఖాత రామచంద్రారెడ్డి సంస్మరణ సభ ఆదివారం కోహెడలో జరగనుంది. కోసా దాదా కుటుంబం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లి గ్రామంలో సెప్టెంబరు 25న అంత్యక్రియలు నిర్వహించారు. కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామానికి చెందిన ఖాతా రామచంద్రారెడ్డి(రాజు దాదా) కుటుంబసభ్యులు రీపోస్టుమార్టం కోసం హైకోర్టు, సుప్రీంకోర్టు తలుపు తట్టగా, చివరికి ఈనెల 18న భౌతికకాయాన్ని ఖననం చేశారు. ఇద్దరు మావోయిస్టు నాయకుల సంస్మరణ సభ ఆదివారం కోహెడలోని సింగరాయ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేశారు. జస్టిస్ చంద్రకుమార్, ఆదివాసీ హక్కుల కార్యకర్త సోనీసోరీ, హక్కుల కార్యకర్త గాదె ఇన్నయ్య, తెలంగాణ పౌరహక్కుల సంఘం నాయకులు ఎన్.నారాయణరావు, మాదన కుమారస్వామి, విప్లవ రచయితల సంఘం నుంచి పాణి తదితరులు హాజరుకానున్నారు.

పేలిన గ్యాస్ సిలిండర్
వంటగదిలోని వస్తువులు దగ్ధం
గజ్వేల్ పట్టణంలో తప్పిన పెను ప్రమాదం 6

చెట్టు కిందనే అంగన్‌వాడీ చదువులు
భవనం లేక విద్యార్థుల అవస్థలు
సామగ్రికి ప్రాథమిక పాఠశాల వంటగదే దిక్కు 7

మున్సిపాలిటీలకు ఆదాయ వనరుల్లో ఆస్తిపన్ను ప్రధానమైనది. ఈ పన్ను వసూళ్లతోనే పట్టణాల అభివృద్ధి, మున్సిపల్ నిర్వహణ కొనసాగుతుంటుంది. అయితే, సిద్దిపేట జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన కార్యాలయాల నుంచి రావాల్సిన ఆస్తి పన్ను బకాయిలు గుదిబండగా మారాయి. మున్సిపాలిటీ నోటీసులు జారీచేస్తున్నప్పటికీ, ఆయా శాఖల అధికారులు స్పందించడం లేదు. ఎలా వసూలు చేయాలో అర్థంకాక మున్సిపల్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.



బకాయిల గుదిబండ

పెండింగ్‌లో ప్రభుత్వ భవనాల ఆస్తిపన్ను

అసలు కంటే రెట్టింపవుతున్న వడ్డీ

నోటీసులకు ఆయా శాఖల నుంచి స్పందన కరువు

నిధులు లేవంటున్న అధికారులు.. అభివృద్ధికి ఆటంకం

మున్సిపాలిటీల ప్రధాన ఆదాయ వనరుకు గండి

జిల్లాలోని మున్సిపాలిటీల్లో ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలు

మున్సిపాలిటీ	నివాసాలు	కార్యాలయాలు	పెండింగ్
సిద్దిపేట	36,859	82	రూ.3.60 కోట్లు
హుస్నాబాద్	7,392	42	రూ.1.09 కోటి
దుబ్బాక	6,252	34	రూ.70.80 లక్షలు
గజ్వేల్	12,809	18	రూ.1.29 కోట్లు
చేర్యాల	5,214	15	రూ.5.06 లక్షలు

సిద్దిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సిద్దిపేట, దుబ్బాక, చేర్యాల, హుస్నాబాద్, గజ్వేల్ ఐదు మున్సిపాటీలీలున్నాయి. వీటిలో మొత్తంగా 68 వేలకుపైగా నివాసాలుండగా, 190కిపైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన కార్యాలయాల భవనాలు ఉన్నాయి. ఈ ప్రభుత్వ కార్యాలయాల నుంచి కొన్నేళ్లుగా ఆస్తిపన్ను వసూలు కావడం లేదు. వీటికి సంబంధించి మున్సిపాలిటీలకు మొత్తంగా రూ.6.70 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి.

వడ్డీతో తడిసిమోపెడు

ప్రభుత్వ కార్యాలయాల బకాయిల్లో అసలు కంటే వడ్డీనే రెట్టింపు అవుతుండడం గమనార్హం. ప్రతీ సంవత్సరం ఆస్తిపన్నుతో పాటు వడ్డీ కూడా కలపడంతో పన్ను మొత్తం కలిసి తడిసిమోపెడవుతోంది. అధికారులు పదేపదే నోటీసులు జారీ చేస్తున్నప్పటికీ, ఆయా శాఖల నుంచి నిధులు విడుదల కాలేదని సమాధానం వస్తుండడంతో సిబ్బంది వెనుదిరుగుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు మిగతా 8లో

ప్రతీ ఏటా పేరుకుపోతున్నాయి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన ఆస్తిపన్ను బకాయిలు ప్రతీ ఏటా పేరుకుపోతున్నాయి. దీంతో మున్సిపల్ నిర్వహణ, అభివృద్ధి కష్టతరమైతున్నది. పేరుకుపోయిన ఆస్తిని పలు విడతలుగా ఆయా శాఖల అధికారులు చెల్లించేలా చొరవ తీసుకోవాలి. మున్సిపల్ నుంచి నోటీసులు జారీ చేయగా, కొందరు అడపాదడపా చెల్లిస్తున్నారు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల అధికారులు మాత్రం స్పందించడం లేదు.

- ఆశ్రిత్‌కుమార్, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్

క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలి

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని, క్రమశిక్షణతో మెదలి, బాగా చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఎస్సీ ఎస్టీ, మైనార్టీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. శనివారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మంత్రి విద్యార్థులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే గురుకులాలకు ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచిందని గుర్తుచేశారు. తాను మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి మూడు నెలలే గడుస్తుందని తప్పకుండా హాస్టల్ విద్యార్థులకు వసతులు కల్పించి సమస్య లేకుండా కృషిచేస్తానని అన్నారు. మిట్టపల్లి గురుకుల పాఠశాలకు కొన్ని వసతులు కావాలని సిబ్బంది తెలిపారని, రూ.10లక్షలు విడుదల చేస్తామని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇంటిగ్రేట్ స్కూల్ ఏర్పాటు చేసి అన్ని వసతులు కల్పించనున్నామని అన్నారు. హాస్టల్లో ఉన్న ఉపాధ్యాయులు పిల్లలతో ప్రేమగా ఉండాలని వారితో మమేకమై సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధంగా కృషి చేయాలని అన్నారు. జిల్లాకు మంచి కలెక్టర్ అందుబాటులో ఉన్నారని అభినందించారు. కార్యక్రమంలో డీసీవో ప్రిన్సిపల్ లక్ష్మాంజలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్

కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలి

చిన్నకోడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థినులకు రుచికరమైన భోజనం అందించాలని కలెక్టర్ హైమావతి సిబ్బందిని ఆదేశించారు. చిన్నకోడూరు మండలం అల్లీపూర్ కేజీబీవీ పాఠశాలను శనివారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వంట గదికి వెళ్లి రాత్రి భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు ప్రకారం వంట సరుకులు అందిస్తున్నారా.. సన్నబియ్యం నాణ్యత ఎలా ఉందని ఆరా తీశారు. కలెక్టర్ మాట్లాడుతూ కడుపు నిండా తినాలని బాగా తింటేనే శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటారని విద్యార్థినులకు సూచించారు. పాఠశాల ప్రాంగణంలో వెలుతురు సరిగా లేదని, లైట్లు అమర్చాలని విద్యుత్ శాఖ ఏఈని ఫోన్ ద్వారా ఆదేశించారు. అనంతరం చిన్నకోడూరు పీహెచ్‌సీని జిల్లా ఆమె ఆకస్మికంగా సందర్శించి అటెండెన్స్, ఓపీ రిజిస్టర్ తనిఖీ చేశారు. రాత్రి సమయంలో విధులు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణలోని 108 అంబులెన్స్ సిబ్బందితో కలెక్టర్ మాట్లాడారు.

మాజీ మంత్రి హరీశ్‌రావు చొరవతో.. జోర్డాన్ నుంచి స్వగ్రామానికి..

● తమను రక్షించాలని 12 మంది వేడుకోలు

● స్పందించి సొంత డబ్బుతో పెనాల్టీ కట్టిన హరీశ్

దుబ్బాక, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో ఉపాధి కోసం జోర్డాన్ దేశం వెళ్లి, అక్కడ చిక్కుకుపోయిన 12 మంది బాధితులు ఎట్టకేలకు వారి స్వగ్రామాలకు చేరుకున్నారు. అలా తిరిగి వచ్చిన బాధితుల్లో సిద్దిపేట జిల్లాకు చెందిన ఇద్దరు ఉన్నారు. దేశం కాని దేశంలో ఇబ్బందులు పడుతున్న తరుణంలో మాజీ మంత్రి హరీశ్‌రావు చొరవతో తిరిగి ఇంటికి వచ్చామని జిల్లాలోని దుబ్బాకకు చెందిన పెంద్యాల మహేందర్, భూంపల్లికి చెందిన బొమ్మనమైన పోచయ్య 'ఆంధ్రజ్యోతి'తో పేర్కొన్నారు. వీరు గతేడాది సెప్టెంబర్ 25న ఉపాధి కోసం ముంబైలోని ఒక ఏజెన్సీ సహకారంతో ఉచిత వ్యవసాయ వీసాపై జోర్డాన్ దేశానికి వెళ్లారు. అక్కడ రాజధాని నుంచి 500 కి.మీ దూరంలో ఇజ్రాయిల్ సరిహద్దు సమీపంలోని ఎడారి ప్రాంతంలో ఉన్న ఆర్మీ బేస్డ్ కంపెనీలో కూరగాయల ప్యాకింగ్ అని చెప్పి, ఎడారిలో వ్యవసాయ తోటలు, ప్లాంటేషన్లో వివిధ పనులకు నియమించారు. రోజుకు 10 గంటలకు పైగా పనులు చేయించి, సరైన ఆహారం పెట్టకుండా వేధించేవారు. దీనితో దాదాపు 12 మంది బాధితులు తమను ఇండియాకు తిరిగి తీసుకురావాల్సిందిగా మాజీ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకుపోయారు. వెంటనే ఆయన స్పందించి, అక్కడి వారితో మాట్లాడారు. తన సొంత ఖర్చులతో బాధితుల తరఫున పెనాల్టీలు చెల్లించి, వారి తిరుగు ప్రయాణానికి టికెట్లు కూడా బుక్ చేయించి, స్వదేశానికి వచ్చేందుకు హరీశ్‌రావు చొరవ తీసుకున్నారని బాధితులు తెలిపారు. ఎట్టకేలకు శనివారం తెల్లవారుజామున 12 మంది జోర్డాన్ బాధితులు హైదరాబాద్ చేరుకోని, హరీశ్‌రావును కలిశారు. తమను ఇండియాకు తీసుకువచ్చేందుకు ఆయన చేసిన కృషికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు అనంతరం వారి యోగక్షేమాలు తెలుసుకున్న ఆయన వారికి భోజనాలు ఏర్పాటు చేసి, స్వీట్లు అందజేసి, స్వగ్రామాలకు వెళ్లేందుకు వాహనాలను ఏర్పాటు చేశారు. తమను ఇండియాకు తీసుకువచ్చేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు అక్కడి అధికారులతో, కంపెనీ సిబ్బందితో మాట్లాడి, ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. ఆయన చేసిన సహాయం మరువలేనిదని బాధితుడు మహేందర్, పోచయ్య తెలిపారు.





భార్యబిడ్డతో పెంద్యాల మహేందర్, పోశయ్యను చూసి ఏడుస్తున్న భార్య





ఆకాశ వింతలు

వాతావరణంలో వచ్చిన మార్పులతో శనివారం జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉన్నది. ఉదయం కొండపాక శివారులో వరిచేలపై మబ్బులు పరిచినట్టుగా ఏర్పడగా సాయంత్రం సూర్యాస్తమ సమయంలో మర్పడగ శివారులో ఎర్రటి కాంతితో కనువిందు చేసింది.

- కొండపాక, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి)

సైబర్ మోసాలకు వ్యక్తులే కాదు.. వ్యవస్థలూ కుదేలు: సీపీ

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలు వ్యక్తులకే పరిమితం కాలేదని, వ్యవస్థలు కూడా కుదేలవుతున్నాయని సీపీ విజయ్‌కుమార్ అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సు ముగింపు వేడుకకు ఆయన హాజరయ్యారు. శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సునీత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీపీ మాట్లాడుతూ దేశంలోని సైబర్ మోసాలకు ఇతివృత్తంగా వచ్చిన ప్రముఖ వెబ్ సిరీస్‌లో జమ్తారా గ్రామాన్ని ఉదాహరణగా ఉటంకిస్తూ విద్యార్థులు అలాంటి వాస్తవాల గురించి తెలుసుకోవాలని కోరారు. సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో నైపుణ్యాన్ని సంపాదించాలని సూచించారు. ఐటీ రంగంలో ఉద్యోగ కష్టాలు ఎదురైనప్పటికీ, సామర్థ్యాలు ఉన్నవారు ఆశాజనకమైన కెరీర్ అవకాశాలను కనుగొంటారని స్పష్టంచేశారు. పోటీతత్వ డిజిటల్ యుగంలో విద్యార్థులు నైపుణ్యంతో పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అయోధ్యరెడ్డి, సెమినార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగం శ్రీనివాసరెడ్డి, కన్వీనర్లు అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ విజయ్‌కుమార్

బీవీఆర్ఐటీని సందర్శించిన చినాబ్ వంతెన రూపకర్త మాధవీలత


మాట్లాడుతున్న ప్రొఫెసర్ మాధవీలత

నర్సాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ప్రముఖంగా నిలిచిన చినాబ్ వంతెన రూపకర్త(డిజైన్ ప్రొవైడర్) ప్రొఫెసర్ మాధవీలత శనివారం నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలను సందర్శించారు. కళాశాలలోని వివిధ విభాగాలను పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలను తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశం నిర్వహించి, చినాబ్ వంతెన నిర్మాణం, దాని ఆవశ్యకతపై వివరించారు. కార్యక్రమంలో ఛైర్మన్ విష్ణురాజు, వైస్ ఛైర్మన్ రవిచంద్రన్, ప్రిన్సిపాల్ సంజయ్ దూబేతో పాటు పలువురు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో, కిడ్నాప్ కేసు నమోదు

కల్హేర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కల్హేర్‌లో మేనమామ వద్ద ఉంటూ చదువుకుంటున్న బాలికను మాయమాటలు చెప్పి తీసుకుపోయిన యువకుడిపై పోక్సో, కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు కంగ్టి సీఐ వెంకట్‌రెడ్డి శనివారం తెలిపారు. మండల పరిధిలోని రాపర్తి గ్రామానికి చెందిన 24 ఏళ్ల యువకుడు, తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను లోబరుచుకుని తీసుకువెళ్లాడు. రెండు నెలల క్రితం కల్హేర్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్, కిడ్నాప్ కేసు నమోదు కాగా, పోలీసులు వారిని గుర్తించి తీసుకువచ్చారు. యువకుడిపై పోక్సో, కిడ్నాప్ కేసులు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయాధికారి అతనికి రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. బాలికల జోలికి వెళ్లినా, ఎవరైనా సహకరించినా జీవితాంతం జైల్లో ఉండాల్సి వస్తుందని యువకులను సీఐ హెచ్చరించారు.

సిగ్నల్ వద్ద ఆగిన బైక్‌ను ఢీకొట్టిన కారు

● వ్యక్తికి తీవ్ర గాయాలు

నర్సాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ ప్రధాన చౌరస్తా వద్ద సిగ్నల్ వద్ద ఆగి ఉన్న బైక్‌ను వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం జరిగిన ఈ ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కౌడిపల్లి మండలం తుంకి గ్రామానికి చెందిన రమేష్‌గా గుర్తించారు. సంగారెడ్డి జిల్లా బొంతపల్లి సమీపంలోని ఓ ప్రైవేటు కంపెనీలో విధుల కోసం బైక్‌పై వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. సిగ్నల్ పడటంతో బైక్ ఆపిన రమేష్‌ను, వెనుక నుంచి నిర్లక్ష్యంగా కారు నడుపుతూ వచ్చిన డ్రైవర్ వేగంగా ఢీకొట్టాడు. దీంతో రమేష్ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కారులో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కారులో ఉన్న ఇద్దరూ మద్యం సేవించి ఉన్నారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

185 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత


బియ్యాన్ని పట్టుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు

కొల్చారం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కొల్చారంలోని పోతంశెట్టిపల్లి టీ జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మెదక్ జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు పోతన్ శెట్టిపల్లి గ్రామ పరిధిలోని ఎదుపాయల టీ-జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో డీసీఎంలో 370 బ్యాగుల్లో 185 క్వింటాల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. ఈ బియ్యాన్ని కుల్చారం పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు అమర వీరుల త్యాగాలు వృథా కావు

● మెదక్ ఎస్పీ శ్రీనివాస్‌రావు


రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు

మెదక్ అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల త్యాగాలు వృథా కావని జిల్లా ఎస్పీ శ్రీనివాస్ పేర్కొన్నారు. సంస్మరణ వారోత్సవాల్లో భాగాంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటారన్నారు. రక్తదాన శిబిరంలో 99 యూనిట్లు రక్తం సేకరించి. 80 యూనిట్ల రక్తం నిలోఫర్ ఆసుపత్రికి, 19 యూనిట్లు మెదక్ బ్లడ్ బ్యాంకు తరలించినట్లు అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్


సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ.. స్పెషల్ డ్రైవ్ ద్వారా రెవెన్యూ సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులను పరిష్కరించారో అడిగి తెలుసుకున్నారు. పది రోజుల్లో వెయ్యి దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు, తహశీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

కొడుకు తిట్టాడని వృద్ధురాలు ఆత్మహత్య

హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కొడుకు మందలించాడని వృద్ధురాలైన తల్లి ఆత్మహత్య చేసుకున్నది. వివరాల్లోకి వెళ్లితే హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామానికి చెందిన బోడ కనకవ్వ (75)కు ముగ్గురు కూతుర్లు, కొడుకు ఉన్నాడు. శుక్రవారం రాత్రి ఆమెకు, తన కొడుకుకు గొడవ జరిగింది. ఈ విషయంలో కుమారుడు తల్లిని తిట్టాడు. దీంతో మనస్తాపం చెందిన కనుకవ్వ ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పెద్ద కుమార్తె సుగుణవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ లక్ష్మారెడ్డి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కనకవ్వ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం హుస్నాబాద్ ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి


దత్తు (ఫైల్)

మనూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు రోడ్డు పక్కనే కంచె లేని బావిలో పడి మృతి చెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా మనూరు మండలం మాయికోడ్ గ్రామ శివారులో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన గుండుల దత్తు (40) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ పనులు చేసుకునేవారు. దీపావళి పండుగ సందర్భంగా దత్తు గ్రామానికి వచ్చారు. పండుగ తర్వాత మేనత్త ఇంటికి జహీరాబాద్ వెళ్లిన దత్తు, శనివారం ఉదయం తిరిగి మాయికోడ్ గ్రామానికి వస్తుండగా రోడ్డు పక్కనే కంచె లేకుండా ఉన్న బావి వద్ద బైక్ అదుపు తప్పింది. ఈ క్రమంలో బైక్ పక్కకు పడగా, దత్తు బావిలో పడిపోయాడు. బావి పక్కన బైకు, చెప్పులు ఉండటాన్ని గమనించిన గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా, సాయంత్రం అతని మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి బాబన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపారు.

కంచె లేకపోవడంతోనే..

మనూరు నుంచి మాయికోడ్ వెళ్లే ప్రధాన రహదారి పక్కన వ్యవసాయ క్షేత్రంలో ఉన్న ఈ బావికి కంచె లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని గ్రామస్థులు తెలిపారు. ప్రమాదాలు జరుగకముందే కంచె ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ నిండు ప్రాణం బలి అవడానికి ఇదే కారణమని పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

పేలిన గ్యాస్ సిలిండర్

● వంటగదిలోని వస్తువులు దగ్ధం


దగ్ధమైన వస్తువులు

గజ్వేల్ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో పెను ప్రమాదం తప్పింది. గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన మరియాల వీరేశం గజ్వేల్ పట్టణంలో నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం వీరేశం ఇంట్లో పూజ గదిలో దీపాలు వెలిగించే సమయంలో సిలిండర్ పేలడంతో మంటలు వంటగదికి వ్యాపించాయి. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సమయానికి మంటలను ఆర్పివేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు కానీ, వంటగదిలోని వస్తువులు దగ్ధమయ్యాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు.

భర్త వేధింపులు.. గృహిణి అదృశ్యం


సౌజన్య

పటాన్‌చెరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపుల కారణంగా ఓ గృహిణి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, ఇస్నాపూర్‌లో నివాసం ఉంటున్న సౌజన్య శుక్రవారం మధ్యాహ్నం సమయంలో పటాన్‌చెరు బస్టాండులో ఉన్నానని తన తండ్రి సుభాష్‌కు ఫోన్ చేసింది. భర్త శ్రీకాంత్ తాగి వచ్చి వేధిస్తున్నాడని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. బంధుమిత్రుల వద్ద వెతికినా ఫలితం దక్కలేదు. ఆమె తమ్ముడు అరవింద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

డ్యూటీకి వెళ్లిన ఆర్టీసీ డ్రైవర్..


సైమన్

పటాన్‌చెరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): డ్యూటీకి వెళ్లిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం, పటాన్‌చెరు శాంతినగర్ కాలనీలో నివాసం ఉంటున్న సైమన జీడిమెట్ల డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. అక్టోబరు 22న డ్యూటీకి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లారు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో భార్య నాగలక్ష్మి ఫోన్ చేయగా, రేపు మధ్యాహ్నం వస్తానని సమాధానం ఇచ్చారు. బుధవారం సాయంత్రం కూడా ఇంటికి రాకపోవడంతో భార్య ఫోన్ చేయగా, స్విచ్ఛాఫ్ అయింది. అనంతరం జీడిమెట్ల డిపో మేనేజర్ ఆంజనేయులుకు ఫోన్ చేయగా, మూడు రోజులుగా డ్యూటీకి రావడం లేదని తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

10 కేజీల ఎండు గంజాయి పట్టివేత


పోలీసుల అదుపులో నిందితుడు, గంజాయి

పటాన్‌చెరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రవాణా చేస్తున్న 10 కేజీల ఎండు గంజాయిని పట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర ఉస్మానాబాద్‌కు చెందిన సంతోష్ మధుకర్ చవాన్ శుక్రవారం సాయంత్రం తెల్లాపూర్ పురపాలక పరిధిలోని ముత్తంగి ఔటర్ సర్వీస్ రోడ్డుపై మోటారు సైకిల్‌పై ప్రయాణం చేస్తుండగా పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రం ఖుర్దా గ్రామంలో సురేష్ బేహార్ వద్ద కొనుగోలు చేసిన కేజీల ఎండు గంజాయి, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సంతోష్ మధుకర్ చవాన్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

కల్లు దుకాణాలపై ఎక్సైజ్ దాడులు

● 110 లీటర్ల కల్లు పారబోత, నలుగురిపై కేసు నమోదు


కల్లును పారబోస్తున్న ఎక్సైజ్ పోలీసులు

అల్లాదుర్గం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా జాతీయ రహదారులపై అక్రమంగా కల్లు విక్రయాలు జరుపుతున్న కల్లు వ్యాపారులపై శనివారం దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఎస్ఐ రాజేశ్ తెలిపారు. అనుమతులు లేకుండా కల్లు విక్రయాలు జరుపుతున్నారన్న సమాచారంతో తమ సిబ్బందితో కలిసి ఈ దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా నిల్వ ఉన్న 110 లీటర్ల కల్లును పారబోసి, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా కల్లు విక్రయాలు జరిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.



తాటికల్లును వంచుతున్న గీతాకార్మికుడు

పేరెట్టి ముద్దుగా పిలి చెట్టు

తాటిచెట్లకు ఆసక్తికర పేర్లు

గీత కార్మికులు, కల్లుప్రియుల వినూత్న నామకరణ సంస్కృతి

రుచి, ఆకృతి, స్థలాన్ని బట్టి విభిన్న నామధేయాలు

పటేల్‌తాడు, కోడెనాగు, బంగారు తీగ.. ఎన్నో పేర్లు



దుబ్బాక, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆ చెట్టు కల్లు ముట్టాలంటే పటేల్‌తో పోటీపడాలి.. కోడెనాగు చెట్టు కల్లు తాగితే బుసలు కొట్టాల్సిందే.. బంగారు తీగ కల్లు తాగితే బొంగరంలా గిర్రున తిరగాలి... ఇవి తాటి చెట్లకు రుచి, ఆకృతి, స్థలం ఆధారంగా గౌడన్నలు(గీత కార్మికులు), కల్లు ప్రియుల్లో సాధారణంగా వాడుకలో ఉన్న మాటలు. ఇందులోని బంగారు తీగ, కోడెనాగు అంటే తాటిచెట్లకు ముద్దుగా వారు పెట్టుకున్న విభిన్నమైన పేర్లు. ఇవే కాదు ఇంకా చాలా చాలా పేర్లతో వాటిని పిలుస్తుంటారు. ప్రతీ తాటి చెట్టు వెనుక ఒక పేరు, ఒక చరిత్ర, ఒక రుచి దాగి ఉంది. వాటి ఆధారంగా పెట్టిన పేర్లు గీత కార్మికులు, కల్లు ప్రియులు ఎక్కువగా ఉండే జిల్లాతో పాటు ఇతర చాలా ప్రాంతాల్లో వినిపిస్తుంటాయి. విభిన్నమైన నామకరణ సంస్కృతి కల్లుతో ముడిపడిన గీత కార్మికులు, కల్లు ప్రియుల ప్రత్యేకమైన అభిమానాన్ని, అనుబంధాన్ని తెలియజేస్తుంది.

పేర్లు పెట్టడానికి కారణాలు

తాటి చెట్లకు నామకరణం చేయడానికి అనేక అంశాలు దోహదపడుతున్నాయి.

● **యజమాని/స్థలం పేర్లు:** చెట్లను గుర్తించుకునేందుకు వీలుగా, భూస్వాముల పేర్లు, స్థలాల పేర్లను చెట్లకు పెట్టేవారు. గతంలో భూములు ఎక్కువగా దొరలు, పటేల్, పట్వారీ, కరణాల చేతుల్లో ఉండటం వల్ల, వారి వ్యవసాయ భూముల్లో పెరిగే చెట్లకు ఎక్కువ శాతం భూస్వాములే పేర్లు పెట్టారని తెలుస్తుంది. గీత కార్మికులు ముందుగా ఆ భూస్వాములకే 'సాక' (ముందుగా కల్లు పోసి) అందించి, ఆ తర్వాతే మిగిలిన కల్లును ఇతరులకు అమ్మేవారు. చెట్టుకు కొంత చొప్పన (రొక్కం) చెల్లించే వారు. దుబ్బాకలో పన్యాల దొరలు పాలించినందున వారి పేరు మీద పన్యాల తాడు, ఉమ్మారెడ్డి దొర తాడు, పటేల్ తాడు, దొరవారి తోటలో ఉంటే దీవార్ తోట తాళ్ల (దొరవారితోటగా మారింది) వంటి పేర్లు వచ్చాయి.

● **రుచి ఆధారంగా :** కల్లు రుచి అంటే తీపి, పులుపు, ఒగరుతో పాటు మత్తు ఎంతసేపు ఉంటుందనేది ఆధారంగానూ పేర్లు పెట్టారు. పొద్దుతో పాటే పొంగి, బుస్సలు కొట్టేలా మత్తుని చ్చేది తాటిచెట్టుకు కోడెనాగు, మత్తు ఎక్కువగా ఉండే అనిపించే చెట్టుకు పుట్టగడ్డ, తాగితే తిమ్మిరి వచ్చే కల్లు ఉండే చెట్టుకు తేలుతాడు అని రుచిని బట్టి వివిధ రకాలు పేర్లు వినిపిస్తూ ఉంటాయి.

● **ఆకారం, స్థలం ఆధారంగా :** చెట్టు ఆకృతి, అది పెరిగిన చోటును బట్టి కూడా పేర్లు పెడతారు. పుట్టమీద ఉన్న చెట్టును పుట్టగడ్డ తాడు కల్లు అని, పేదలు గుడిసెలు వేసుకున్న చోట ఉన్న చెట్టును గుడిసెకాడి కల్లు అని అంటారు.

● **సామాజిక వర్గం పేర్లు :** చెట్టు యజమాని పేరుతో పాటు, కులాల పేరుతో కూడా తాటి చెట్లను పిలిచేవారు. మంగళోళ్ల తాడు, బెస్తోళ్ల తాడు వంటివి కులాల పేర్లతో పిలిచే తాటి చెట్లు.

● **సినిమాల పేర్లు :** పాతకాలం సినిమాలపై ఉన్న క్రేజ్‌ను బట్టి కూడా కొన్ని చెట్లకు పేర్లు పెట్టేవారు. బాలనాగమ్మ తాడు, మాయల ఫకీర్ తాడు, ప్రేమదేశం తాడు, సత్యహరిశ్చంద్ర తాడు, సలీం అనార్కలీ తాడు.

తాడు.. బొత్త

తాటి చెట్లను సాధారణంగా వాడుక భాషలో తాడు, తాళ్లు, బొత్త అని పిలుస్తుంటారు. ఒకే చెట్టు కోసం ఇద్దరు గొడవ పడడంతో ఆ చెట్టును పంచాయితీ బొత్త అని అంటుంటారు. వ్యాపారం, దిగుబడి ఆధారంగా ఒక చెట్టు కల్లు దిగుబడి, దాని అమ్మకాల క్రేజ్‌ను బట్టి పేర్లు ఉంటాయి. ముంతెడు కల్లు పడితే మోకాళ్ల వరకు తిండనే అర్థంలో ఎక్కువగా కల్లునిచ్చి, బాగా అమ్ముడయ్యే చెట్లను బర్కత్ తాడు, బంగారు తీగ, మహాలక్ష్మి చెట్టు అని పిలుస్తారు. అలాగే కల్లు బాగా వచ్చే చెట్లను ముత్యం, పగడం, వజ్రం, బంగారు బిందె అని కూడా పిలుస్తుంటారు. మేఘాల రంగులో కల్లు ఇచ్చే చెట్టును ఇంద్రధనస్సు అంటారు.

ఆది దంపతుల నామధేయం

తాటి చెట్లలో ఆడ (పండు తాళ్ల), మగ (పోతు తాళ్ల) రకాలు ఉంటాయి. ఇవి కల్లు ఇచ్చే సమయం, నాణ్యతలో విభిన్నంగా ఉంటాయి. ఎక్కువగా కల్లునిస్తూ, ఆ చెట్టును నమ్ముకుని బతుకుతున్న వారికి ఆర్థిక భరోసానిచ్చే పండు తాడును పార్వతీ దేవి చెట్టు అని పిలుస్తుంటారు. పోతు తాడు చెట్టును పరమేశ్వరుడి చెట్టు అంటుంటారు. డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకు రుచికరమైన కల్లును అమితంగా ఇస్తుంది. కల్లు ప్రియులు దీనిని బాగా ఇష్టపడతారు. పార్వతీపరమేశ్వరులను ఆది దంపతులుగా కీర్తించినట్లే, ఈ చెట్టు పక్కపక్కనే ఉండి, ఆది దంపతుల పేరున స్థిరపడ్డాయి.

బీజేపీ అధికారంలోకి వస్తే.. బీసీని సీఎం చేస్తాం

● బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ గాలిమాటలు

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మేరా యువభారత్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ సీఎం అవుతారని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. మెదక్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రఘునందన్‌రావు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ గాలి మాటలు చెబుతోందని, తమ పార్టీపై అర్థరహిత ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. బీసీ జనాభా ప్రకారం రాష్ట్ర కేబినెట్‌లో 10 మంది బీసీ మంత్రులు ఎందుకు లేరని ఆయన ప్రశ్నించారు. దేశంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈడబ్ల్యూఎస్)కు రిజర్వేషన్లు కల్పించింది బీజేపీయేనన్నారు. వీకర్ సెక్షన్‌కు గుర్తించింది కూడా తమ పార్టీయేనన్నారు. రాష్ట్రంలో ఎవరెంత ఉంటే వారికి అంత ఇవ్వాలనేదే తమ నినాదమన్నారు.

బస్సు ప్రమాదం కలిచివేసింది..

కర్నూలు శివారులో జరిగిన బస్సు ప్రమాద ఘటన కలిచివేసిందని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ప్రమాదంలో మెదక్ మండల పరిధిలోని శివ్వాయిపల్లి గ్రామానికి చెందిన సంధ్యారాణి, చందన మృతి చెందడం బాధకరమన్నారు. మృతదేహాలను గ్రామానికి తీసుకొచ్చేందుకు అక్కడి అధికారులతో మాట్లాడినట్టు ఆయన తెలిపారు. ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే ఆర్టీఏ అధికారులు హడావిడి చేస్తారన్నారు. హైదరాబాద్‌లోని బీహెచ్ఈఎల్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు నిత్యం వందల సంఖ్యలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు తిరుగుతున్నాయని, వాటిపై ఎలాంటి నియంత్రణ లేకపోడంతో ఘోర ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. మృతుల కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి వారిని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు మల్లేశంగౌడ్, ప్రధాన కార్యదర్శులు రంజిత్‌రెడ్డి, శ్రీనివాస్, సీనియర్ నాయకులు నందారెడ్డి, రమేష్‌గౌడ్, సిద్ధిరాములు, జిల్లా నాయకులు నాగరాజు, శివ, శ్రీపాల్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి మూలం ఆయుర్వేదం

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వైద్యానికి మూలం ఆయుర్వేదమేనని సీనియర్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య అన్నారు. ధన్వంతరి జయంతి ఉత్సవాల్లో భాగంగా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం పట్టణ కమిటీ, ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంఎన్ఆర్ ఆసుపత్రి సహకారంతో సంగారెడ్డి విద్యానగర్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆమె జ్యోతి వెలిగించి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సమస్యల పరిష్కారానికి భారతీయ ఆయుర్వేదం సంపూర్ణ పరిష్కారాలను సూచిస్తుందన్నారు. ఆయుర్వేద బ్రహ్మ ధన్వంతరి వారసత్వం కలిగిన నాయీ బ్రాహ్మణుల సేవలు నేటి సమాజంలో ప్రశంసనీయమని కొనియాడారు. సమాజంలోని ప్రతి వ్యక్తికి న్యాయ సేవలను అందించడం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి నాయీ బ్రాహ్మణ సేవా సంఘం పట్టణ కమిటీ గౌరవ అధ్యక్షుడు దత్తాత్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్, అధ్యక్షుడు మాణిక్ ప్రభు, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, సభ్యులు రంజోల్ ప్రభు, పెంటయ్య, స్వాగత్, ప్రభు, శేఖర్, ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదయ్య, ప్రధాన కార్యదర్శి సుకుమార్, రాజారాం, మోహన్, మహిళా విభాగం సభ్యులు సుధామణి, మల్లేశ్వరి, పద్మావతి, జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ నాగభూషణం, ప్రధాన కార్యదర్శి రాజారామ్, యూత్ గౌరవ అధ్యక్షుడు అంజనేయులు, అధ్యక్షుడు చరణ్, ప్రధాన కార్యదర్శి రాము, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, సభ్యులు హనుమంతు, అనిల్, వీరన్న, సత్యం, అంజయ్య పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రోహిత్ రావు

బస్సు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

మెదక్ కల్చరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా బస్సు ప్రమాదంలో మరణించిన మెదక్ మండల పరిధిలోని శివాయపల్లి సంధ్యారాణి, కూతురు చందన కుటుంబ సభ్యులను శనివారం మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనాంపల్లి రోహిత్‌రావు పరామర్శించారు. ఈ సంఘటన బాధాకరమని అన్నారు. అనంతరం కలెక్టర్, ఎస్పీకి ఫోన్ చేసి త్వరితగతిన పార్థివ దేహాలను స్వగ్రామానికి తెచ్చే ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ చౌదరి, రమేష్, మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ పవన్ తదితరులు పాల్గొన్నారు



చిలప్‌చెడ్ : వర్షానికి తడిసిన ధాన్యం కుప్పలు



సిర్గాపూర్ సమీపంలో నీటి మునిగిన వరి పంట



నారాయణఖేడ్ పరిధిలోని నిజాంపేటలో నేలకొరిగిన వరి పైరు

చేతికొచ్చిన పంట నీటిపాలు

●భారీ వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం ● నీట మునిగిన పంటలు..

చిలప్‌చెడ్/నారాయణఖేడ్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం చేతికొచ్చాక నీటి పాలైంది. శనివారం కురిసిన అకాల వర్షానికి చిలప్ చెడ్ మండలం పరిధిలోని పలు గ్రామాల్లో ఆరబోసిన ధాన్యమంతా తడిసి ముద్దయింది. టార్పాలిన్ కవర్లు కుప్పలపై కప్పినా నీరు నిలవడంతో ధాన్యం తడిసింది. కోతకు వచ్చిన పంటలు చిత్తడిగా మారి కోయడానికి వీలుకుండా పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. నారాయణఖేడ్‌లో ఒక వైపు ఎండ, మరో వైపు గంటకు పైగా కుండపోత వర్షం కురిసింది. దీంతో నిజాంపేట పరిసరాల్లో కోత దశలో ఉన్న వరి పంట నేలకొరిగింది. సిర్గాపూర్ మండల కేంద్రంతో పాటు పరిసరాల్లో పొలాలు చెరువులను తలపించాయి. ఇప్పటికే పత్తి, ఇతర పంటల్లో నష్టం వచ్చి దిగాలుతో ఉన్న అన్నదాతలకు తాజాగా వర్షానికి వరి పంటకు కూడా నష్టం వాటిల్లడంతో లబోదిబోమంటున్నారు.

చెట్టు కిందనే అంగన్‌వాడీ చదువులు

● భవనం లేక విద్యార్థుల అవస్థలు

● సామగ్రికి ప్రాథమిక పాఠశాల వంటగదే దిక్కు

మనోహరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలో చిన్నారులు సొంత భవనం లేక కొన్నేళ్లుగా ఆరుబయట చెట్టు కింద చదువు కొనసాగిస్తున్నారు. మనోహరాబాద్ మండల కేంద్రంలోని పర్కిబండ మదిర గ్రామం తుపాకులపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో 29 మంది విద్యార్థులు చదువుతున్నారు. గ్రామంలోని అంగన్‌వాడీలో సుమారు 15 మంది పిల్లలు ఉన్నారు. గతంలో ఓ భవనంలో అంగన్‌వాడీని మూడేళ్లపాటు నడిపించారు. అది శిథిలావస్థకు చేరడంతో అంగన్‌వాడీని ప్రాథమిక పాఠశాలకు మార్చారు. పాఠశాల విద్యార్థులకే తరగతి గదులు సరిపోకపోవడంతో అంగన్‌వాడీ విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. తప్పని పరిస్థితుల్లో పాఠశాల ఆవరణలోని చెట్టు కింద చాపలు వేసి అంగన్‌వాడీ చిన్నారులకు బోధన చేస్తున్నారు. వర్షం వస్తే తప్పనిసరి పరిస్థితుల్లో పాఠశాల తరగతి గదుల్లోకి తీసుకువెళ్తున్నారు. పాఠశాల వంటగదిలోనే అంగన్‌వాడీ సామగ్రి పెడుతున్నారు. గ్రామంలో ఎవరిని అద్దెకు గది అడిగినా అంగన్‌వాడీ కోసం ఇవ్వడం లేదని ఉపాధ్యాయురాలు శ్యామల తెలిపారు. గర్భిణులు, బాలింతల పిల్లలకు ఏఎన్ఎం వచ్చి సూదులు వేయడానికి కూడా చెట్టు కింద మట్టిలోనే కూర్చోవాల్సి వస్తుంది. అయినా అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని గ్రామస్థులు మండిపడుతున్నారు. ప్రభుత్వం విద్య కోసం కోట్లు ఖర్చు చేస్తున్నా, చిన్న పిల్లలకు అంగన్‌వాడీ భవనం లేక మట్టిలో విద్యా బోధన చేయడం ప్రభుత్వాలకే సిగ్గు చేటని అసహనం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కలెక్టర్, యంత్రాంగం స్పందించి అంగన్‌వాడీ విద్యార్థులకు భవనం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



చెట్టుకింద చదువుకుంటున్న అంగన్‌వాడీ చిన్నారులు

మోర్గి వంతెనకు మోక్షం ఎప్పుడో?

● నాసిరకం పనులంటూ నిర్మించిన పిల్లర్లు కూల్చివేత...

● మూడేళ్లుగా ముందుకు సాగని పనులు

● రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు





అసంపూర్తిగా ఆగిపోయిన వంతెన నిర్మాణం పనులు(ఫైల్), తొలగించిన పిల్లర్లు

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య రాకపోకల సౌలభ్యం మెరుగుపరచాలనే ఆశయంతో చేపట్టిన మోర్గి వంతెన పనులు 'ఒక అడుగు ముందుకు. మూడు అడుగులు వెనక్కి' అన్న చందంగా తయారయ్యాయి. నిర్మించిన పిల్లర్లను నాణ్యతారహితంగా ఉన్నాయంటూ కూల్చివేయడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. నారాయణఖేడ్ నియోజకవర్గం గుండా మంజీరా నది ప్రవహిస్తుంది. నదికి అవతల వైపున కర్ణాటక రాష్ట్రం ఉండగా, మంజీరా నదిపై మోర్గి, చిల్లర్గి గ్రామాల మధ్య రెండు దశాబ్దాల క్రితమే వంతెన నిర్మించారు. నారాయణఖేడ్ నుంచి కర్ణాటకలోని బీదర్‌కు వెళ్లడానికి ఎక్కువ శాతం మంది ఈ రహదారిని ఉపయోగిస్తారు. పుల్‌కూర్తి, డప్పూర్ మీదుగా వెళ్తే ఖేడ్ నుంచి 50 కిలోమీటర్ల దూరం ఉంటుంది. కానీ మోర్గి మీదుగా వెళితే కేవలం 35 కిలోమీటర్ల దూరమే కావడంతో వాహన చోదకులు ఇదే మార్గాన్ని ఎంచుకుంటారు.

రూ.6.32 కోట్లతో..

ఈ రోడ్డుపై రద్దీ పెరగడంతో కరస్‌గుత్తి పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి మోర్గి మీదుగా సరిహద్దు వరకు రోడ్డు అభివృద్ధి, హైలెవల్ వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.6.32 కోట్లు మంజూరు చేసింది. 2022 మార్చి 26న అప్పటి మంత్రి హరీశ్‌రావు ఈ పనులను ప్రారంభించారు. రోడ్డు పనులు పూర్తి అయినప్పటికీ, వంతెన నిర్మాణానికి సంబంధించిన పిల్లర్ల పనులను పూర్తి చేసి మిగతా పనులను అసంపూర్తిగా వదిలేశారు. దీంతో రాకపోకలు సాగించడానికి పక్కన తాత్కాలికంగా వేసిన డైవర్షన్ రోడ్డు కూడా అధ్వాన్నంగా మారింది. దీనివల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఆరు నెలల క్రితం క్వాలిటీ కంట్రోల్ అధికారులు వంతెన పనులు నాణ్యతారహితంగా ఉన్నాయని, అందువల్ల నిర్మించిన పిల్లర్లను కూడా తొలగింపజేసి తిరిగి మొదటి నుంచి నిర్మించాలని స్థానిక పీఆర్ అధికారులకు సూచించారు. దీంతో రూ. కోటితో వెచ్చించి నిర్మించిన పిల్లర్లను లక్షలు ఖర్చుపెట్టి ఇటీవల తొలగింపజేశారు. కానీ పనులు మళ్లీ ప్రారంభించలేదు.ఈ పరిస్థితుల్లో రెండు రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగుపడడానికి ఉపయోగపడే ఈ వంతెన పనులు ఆలస్యం కావడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరుతున్నారు.

అవస్థలు పడుతున్నాం.



మోర్గి సమీపంలో చేపట్టిన వంతెన నిర్మాణం పనులు నిలిచిపోవడంతో తాము అవస్థలకు గురవుతున్నాం. తమ గ్రామం నుంచి నారాయణఖేడ్‌కు రాకపోకలు సాగించడానికి ఈ వంతెన పైనుంచే ప్రయాణించాల్సి వస్తుంది.

\- ధనరాజ్, మోర్గి గ్రామస్థుడు

త్వరలో టెండర్లు వేస్తాం

గతంలో నిర్మించిన పనులు నాణ్యతారహితంగా ఉన్నాయని క్వాలిటీ కంట్రోల్ అధికారులు సూచించడంతో వాటిని తొలగింపజేశాం. మళ్లీ నిర్మాణ పనుల కోసం టెండర్లు వేయడానికి ప్రణాళిక సిద్ధం చేశాం. త్వరలో టెండర్లువ వేస్తాం.

\- విద్యాసాగర్‌రెడ్డి, ఏఈ, పంచాయతీరాజ్

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

● ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య



ఏబీవీపీ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గజ్వేల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు యత్నిస్తుండగా, పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల మొండి వైఖరి అవలంభిస్తుందని, రేండేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రైవేటు కళాశాలలు బంద్‌కు పిలుపునిచ్చాయని, మరోసారి బంద్‌కు సిద్దమవుతున్నారన్నారు. ప్రభుత్వానికి విద్యా వ్యవస్థపై చిత్తశుద్ది ఉంటే వెంటనే పెండింగ్‌లో ఉన్న రూ.8300 కోట్ల పూర్తిస్థాయి బకాయిలను విడుదల చేయాలని, పేద విద్యార్థులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో మంత్రులను, ముఖ్యమంత్రిని ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. ఆయనవెంట ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవులపల్లి మహేందర్, నగర కార్యదర్శులు గురు, అభిచరణ్, అరుణ్‌కుమార్, కౌశిక్, కార్తీక్, సంజయ్ తదితరులున్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

● బీజేపీ పట్టణ అధ్యక్షుడు శంకర్‌బాబు

హుస్నాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షంతో తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన బీజేపీ శ్రేణులతో కలసి హుస్నాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఈ విషయంపై మార్కెట్ సూపర్ వైజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ధాన్యాన్ని కొనుగోలు చేయుటకు అనేక కొర్రిలు పెడుతుండటంతో 10 రోజులుగా రైతులు మార్కెట్‌లో పడిగాపులు కాస్తున్నారన్నారు. లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన డయ్యర్ ఒక రోజేకే పాడై పోయిందన్నారు. హుస్నాబాద్ మార్కెట్‌కు పూర్తి స్థాయి కార్యదర్శి లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వేముల దేవేందర్‌రెడ్డి, తోట సమ్మయ్య, వరియోగుల అనంతస్వామి, నాగార్జున, నరేష్, రాజేందర్, వేముల రమణ తదితరులున్నారు.

చిన్నారులను వేధిస్తే కఠిన చర్యలు : షీటీం



చేర్యాల మండలం ముస్త్యాల మోడల్‌స్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న షీ టీమ్ సభ్యురాలు స్వప్న

చేర్యాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, ఆరుబయట గాని బాలికలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హుస్నాబాద్ షీ టీమ్ సభ్యురాలు స్వప్న అన్నారు. చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలోని మోడల్‌స్కూల్‌ను షీ టీమ్ బృందం సందర్శించి బాలికా, మహిళా రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గంజాయి, మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు ఇతరత్రా అంశాల పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలని, చెడువ్యసనాలకు తావివ్వకూడదన్నారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరచర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులు ఏఎస్ఐ సదయ్య, ప్రశాంతి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

● కంచె ఏర్పాటులో విఫలం

● యేళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు



ఇళ్ల మధ్యనే ప్రమాదకరంగా మారిన కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

మద్దూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ధూళిమిట్ట మండలంలోని తోర్నాల గ్రామంలో ఇళ్ల మధ్యనే ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఎన్నో యేళ్లుగా విద్యుత్ అధికారులకు విన్నవిస్తున్నా ఇదిగో తీసేస్తున్నాం అదిగో తీసేస్తున్నామంటూ చెబుతున్నా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారిందని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇదే ట్రాన్స్‌ఫార్మర్ పై నుంచి 11 కేవీ విద్యుత్ వైర్లు ఇళ్లపై వెళ్తుండటంతో గృహయాజమానులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఇదే రోడ్డుగుండా వాహనాలు వెళ్లాలంటే ప్రాణాలరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌ఫార్మర్‌ను గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయాలని వాహనదారులతో పాటు గృహయాజమానులు డిమాండ్ చేస్తున్నారు.

గురుకులాల వ్యవస్థ అస్తవ్యస్తం

● తెలంగాణ రెసిడెన్షియల్ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుమ్మ కృష్ణ



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు తుమ్మ కృష్ణ

మర్కుక్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల పరిస్థితి రోజురోజుకూ దిగజారి పోతుందని, అమాయక పేద ప్రజల పిల్లలే అత్యధికంగా బలవుతున్నారని తెలంగాణ రెసిడెన్షియల్ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుమ్మ కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా శనివారం మర్కుక్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వరంగల్‌లోని పీవీ నరసింహారావు గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య ఘటన తమను తీవ్రంగా కలిచివేసిందని అన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా గురుకులాల వ్యవస్థ చూడాలని, ప్రస్తుత గురుకులాల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి అమాయక పిల్లల్ని బలి తీసుకుంటుందని గతంలో హుస్నాబాద్ గురుకుల పాఠశాల విద్యార్థి వివేక్ మృతిపై కూడా ఇంకా విచారణ కొనసాగుతుందని ఇదంతా ప్రభుత్వం మొద్దు నిద్రపోతున్న దానికి సంకేతమని అన్నారు. అమాయక బిడ్డల ప్రాణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని భవిష్యత్తులో ఇలాగే కొనసాగితే గురుకుల పేరెంట్స్ కమిటీ తరఫున పెద్ద ఎత్తున ఉద్యమాన్ని తలపెడతామని హెచ్చరించారు.

రోడ్డుపై సామగ్రి పెట్టవద్దు

గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం. మురళి



గజ్వేల్‌లో ఆయా దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ మురళీ

గజ్వేల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై సామగ్రి పెట్టి ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలిగించవద్దని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం. మురళి దుకాణదారులకు సూచించారు. ఈ మేరకు గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, జాలిగామ క్రాస్ రోడ్డులో వ్యాపారులు, ఫుట్‌ఫాత్ ఆక్రమించి సామగ్రి పెట్టిన వారికి రోడ్డు భద్రత నిబంధనలు, ట్రాఫిక్ నియమ, నిబంధనలను గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని పలు ప్రధాన రోడ్లలో వ్యాపారస్థులు ఫుట్‌పాత్‌లపై, రోడ్డుపై సామగ్రి, అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులు పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని గుర్తించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. వ్యాపారాలు చేసుకునే వ్యాపారస్థులు నిబంధల ప్రకారం వ్యాపారాలు చేసుకోవాలని, ఇతరులకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరించవద్దని సూచించారు. నిబంధనలు పాటించని వ్యాపారులపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి, తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆయనవెంట ఏఎస్సై జగదీశ్వర్, ఇతర ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ గురైన విద్యార్థికి పరామర్శ

గజ్వేల్ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం కోమటిబండ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న మన్విక్ అనే విద్యార్థి శుక్రవారం విద్యుత్ షాక్ గురయ్యాడు, విషయం తెలుసుకొని శనివారం విద్యార్థి విభాగం అధ్యక్షుడు శీలసారం ప్రవీణ్, పంగ మోహన్ బాబు అతడిని పరిమర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తూం శేఖర్, సీనియర్ నాయకులు షేక్ భాస్కర్, ఉబ్బాని అంజనేయులు అంజనేయులు గ్రామస్థులు పాల్గొన్నారు

ఉత్తీర్ణత శాతం పెంచాలి

● డీఐఈవో రవీందర్ రెడ్డి



అధ్యాపకులతో మాట్లాడుతున్న డిఐఈవో రవీందర్ రెడ్డి

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను శనివారం జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్ రెడ్డి తనిఖీ చేసారు. తరగతి గదులను, సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా కళాశాలకు హాజరు కావాలని మంచి ఫలితాలను సాధించాలని సూచించారు. అనంతరం అధ్యాపకుల సమావేశంలో మాట్లాడుతూ ఈ విద్య సంవత్సరం కళాశాల ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని, వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కళాశాల అభివృదికి పాటుపడాలని తెలియజేశారు. సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ సకాలంలో నిర్వహించాలన్నారు.

జూబ్లిహిల్స్‌లో వంటేరు ప్రచారం

ములుగు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అభ్యర్థి తరఫున మాజీ ఎఫ్ డీసీ చైర్మన్, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి ఎర్రగడ్డ పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట ములుగు మాజీ జెడ్పిటిసి జయమ్మ అర్జున్ గౌడ్, కొమ్ము నవీన్ పి ఎస్ సి ఎస్ వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే నేరస్థులను కాపాడుతుంది

● బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్

సిద్దిపేట క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చట్టాన్ని కాపాడాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం నేరస్థులను కాపాడే ప్రయత్నం చేస్తుందని బీజేపీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ ఆరోపించారు. ఈనెల 22న ఘట్కేసర్ వద్ద గోవులను అక్రమంగా తరలిస్తుండగా అడ్డుకున్న గో రక్షకుడు సోను ప్రశాంత్‌పై కాల్పుల జరిపిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పార్టీ నాయకులతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చి మాట్లాడారు. సోను ప్రశాంత్‌పై జరిగిన దాడిని ఖండించారు. గోవులను రక్షించేందుకు కృషి చేస్తున్న కార్యకర్తపై కాల్పులు జరగడం, హిందూ ధర్మంపై హిందువుల మనోభాలపై దాడిగా పరిగణిస్తున్నామని అన్నారు. కాల్పులు జరిగిన వ్యక్తి ఓల్డ్ సిటీకి చెందిన ఇబ్రహీం కావడంతో ప్రభుత్వం మౌనం పాటిస్తుందని మండిపడ్డారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఇప్పటికైనా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వెంకట్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాసనగొట్టు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పేదింటి పెళ్లికూతురుకు బీఆర్ఎస్ పార్టీ నాయకుల అండ

మర్కుక్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, తాజా మాజీ ఎంపీపీ పాండుగౌడ్, తాజా మాజీ జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం, వైస్ ఎంపీపీ బాల్రెడ్డి, మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాలరాజ్, బీసీసెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్‌లు మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన సోమెల్ల లలిత కూతురు అనూష వివాహానికి మండల నాయకులంతా కలిసి 21000 నగదును అందజేశారు.అలాగే గ్రామానికి చెందిన నారన్నగారి రామ్మోహన్‌రెడ్డి బీరువాను అంద జేసి తమ సేవా గుణాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన డొనేషన్ దూ ఫర్ నేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా పుస్తెమట్టెలు అందజేశారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

సిద్దిపేట, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి):మొక్కజొన్న రైతులు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మిరుదొడ్డి పీఏసీఎస్ చైర్మన్ రాజలింగారెడ్డి అన్నారు. శనివారం మిరుదొడ్డి వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



ములుగులో గుర్రాల భారతమ్మ కుటుంబాన్ని పరామర్శించిన డీసీసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి

ములుగు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ములుగు మండల కేంద్రంలో గుర్రాల భారతమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి భారతమ్మ కుటుంబాన్ని పరామర్శించి వారికి 10000 పది వేల ఆర్థిక సాయం అందజేశారు.

108 సేవలు సద్వినియోగం చేసుకోవాలి

108 జిల్లా పోగ్రాం మేనేజర్ జాన్ సాహిద్



సీపీఆర్ చేసే విధానాన్ని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పైలెట్, టెక్నీషియన్

సిద్దిపేట రూరల్,అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో 108 అంబులెన్స్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 108 జిల్లా పోగ్రాం మేనేజర్ జాన్ సాహిద్, ఈఎంఈ హరి రామకృష్ణ అన్నారు. శనివారం సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 108 మరియు ఎన్ఎస్ఎస్ అధ్వర్యంలో సిపిఆర్, ఇతర సేవల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు పాము కాటుకు, ఫిట్స్ వచ్చినప్పుడు, ఏదైనా పురుగుల మందు తాగినప్పుడు, పురిటి నొప్పులు వచ్చినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు.

హార్ట్ స్ట్రోక్ వచ్చిన వారికి సీపీఆర్ ఏలా చేయాలనేది 108 మెడికల్ టెక్నీషియన్ రాజ్ కుమార్, పైలెట్ ఆశోక్ రెడ్డి విద్యార్థులకు వివరించారు. ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు 108 ఫోన్ చేస్తే క్షతగాత్రులకు సరైన సమయంలో చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఎన్ఎస్ఎస్ సేవకులు చక్రవర్తి, శివకుమార్, శ్రీనివాస్ తదితరలు పాల్గొన్నారు.

నేడు సంచార జాతుల కళా ప్రదర్శనలు

గజ్వేల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నేడు గజ్వేల్ పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో సంచార జాతుల కళా ప్రదర్శనలను ఏర్పాటు చేసినట్లు సామాజిక సమరసత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు తెలిపారు. విముక్త సంచార జాతుల అభివృద్ధి మండలి, సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో సంస్కృతి విలువలను అందించే సంచాల జాతుల కళా ప్రదర్శనలు ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ వర్గాలకు, ఆశ్రిత కులాలకు, కుల చరిత్రలు చెప్పే జీవనం గడిపే విముక్త జాతుల కలలు సమాజ చైతన్యానికి ఉపయెగపడ్డాయని, వాటిని ముందు తరాలకు తెలియజెప్పేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

రోడ్డు బాగు చేయించాలని ఎంపీకి వినతి



ఎంపీ రఘునందన్‌రావుని కలిసి రోడ్డు మరమ్మతు కొరకు విజ్ఞప్తి చేస్తున్న బీజేపీ నాయకులు

రాయపోల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలంలోని బేగంపేట, ఎల్కల్, బంగ్లవెంకటాపూర్ వరకు రోడ్ల పూర్తిగా దెబ్బతిన్నాయని ప్రధానమంత్రి సడక్ యోజన పథకం ద్వారా పునర్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని రాయపోల్ మండల బీజేపీ నాయకులు మెదక్ ఎంపీ రఘునందన్‌రావును శనివారం కలిసి విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎంపీ గతంలో ప్రధానమంత్రి సడక్ యోజన పథకం ద్వారా మంజూరైన రూ. 34 లక్షల నిధులు రద్దు కావడంతో తిరిగి ఎస్టిమేషన్ వేసి పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే నాచారం నుంచి హైమద్‌నగర్ వరకు రోడ్డు మరమ్మత్తు విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు మంకిడి స్వామి, మాజీ అధ్యక్షులు మాదాసు వెంకట్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు కోసం స్థల పరిశీలన చేసిన జిల్లా జడ్జి

హుస్నాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్‌లో నూతన కోర్టు భవన నిర్మాణానికి శనివారం జిల్లా జడ్జి సాయి రమాదేవి పోతారం (ఎస్) గ్రామ సమీపంలో స్థలాన్ని పరిశీలన చేశారు. ఇందులో హుస్నాబాద్ జూనియర్ సివిల్ జడ్జి రేవతి, హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పొన్నం అశోక్‌గౌడ్, తహసిల్దార్ లక్ష్మారెడ్డి, హుస్నాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు యాల శ్రీనివాస్‌రెడ్డి, ఒగ్గోజు సదానందం, కన్నోజు రామక్రిష్ణ, న్యాయవాదులు హనుమయ్య, కిరణ్ కుమార్, దీకొండ ప్రవీన్ తదితరులున్నారు.



నూతన కోర్టు భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేసిన జిల్లా జడ్జి

కన్వీనర్‌గా జంగిటి యాదగిరి

చేర్యాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ చేర్యాల మండల కన్వీనర్‌గా జంగిటి యాదగిరిని ఎన్నుకున్నారు. ఈమేరకు శనివారం చేర్యాలలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో-ఇన్‌చార్జి మల్లిగారి యాదగిరి నియామక ఉత్తర్వు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ బలోపేతంతో పాటు దళితుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పాటుపడాలని సూచించారు.

బకాయిల గుదిబండ

(5వ పేజీ తరువాయి)

సంబంధించి అత్యధికంగా పాత కలెక్టరేట్, ప్రస్తుత డా.బీఆర్ అంబేద్కర్ భవనం రూ. 46 లక్షలు, విద్యుత్ కార్యాలయం రూ. 29 లక్షలకుపైగా, వెటర్నరీ ఆసుపత్రి రూ. 29 లక్షలు, సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ కార్యాలయం రూ. 19 లక్షలు, రోడ్లు, భవనాల శాఖ రూ. 16 లక్షలకుపైగా బకాయిలు పేరుకుపోయాయి. ప్రభుత్వ శాఖల నిర్వహణకు నిధులు తక్కువగా విడుదలవుతుండడం వల్ల ఆస్తిపన్ను చెల్లించడానికి ఇబ్బందిగా మారుతోంది. ఆస్తిపన్ను కోసం ప్రత్యేక నిధులు విడుదల చేయాలని చాలా మంది అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకపోవడం కూడా ఈ సమస్య తీవ్రత పెరగడానికి ఒక కారణంగా నిలుస్తోంది. మున్సిపాలిటీలు లక్ష్యాలను చేరుకోలేకపోవడానికి ఈ ప్రభుత్వ బకాయిలే ప్రధాన కారణంగా మారాయి. ప్రభుత్వ శాఖలే పన్ను చెల్లించకుండా మొండిచేయి చూపడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పన్ను పరిధిలోకి రాని భవనాలు

బకాయిలు ఒకవైపు గుదిబండగా ఉంటే, మరోవైపు జిల్లాలోని కొన్ని భవనాలకు పన్ను విధించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కుల సంఘాల భవనాలు, ప్రభుత్వ ఆసుపత్రులు వంటి కొన్ని నిర్మాణాలు పూర్తయినా, ఇంటి నంబర్ కేటాయించినా వాటికి ఆస్తిపన్ను విధించడం లేదు. కొన్ని కొత్త భవనాలకు ఇంటి నంబర్లే కేటాయించడం లేదు. అధికారులకు ఈ విషయం తెలిసినప్పటికీ, రాజకీయ ఒత్తిళ్ల మేరకు తలొగ్గి పన్ను విధించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పన్ను పరిధిలోకి రాని భవనాలను గుర్తించి, వాటికి పన్ను విధించి వసూలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆస్తిపన్ను పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు

శాఖ పేరు	అస్తి పన్ను (రూ.లలో)
డా.బీఆర్ అంబేద్కర్ భవన్	46,33,395
విద్యుత్ పవర్ స్టేషన్	29,53,529
వెటర్నరీ ఆసుపత్రి	29,17,106
తహసీల్దార్ కార్యాలయం	19,22,631
రోడ్లు, భవనాల శాఖ	16,26,120
ఎంపీడీవో కార్యాలయం	12,74,929
ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్	10,45,242
డాగ్ బంగ్లా	9,08,309
డీఈ ఇంజనీరింగ్ కార్యాలయం	9,04,935
ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం	8,.90,722
పోలీస్ కన్వెన్షన్‌హాల్	8,78,166
డీఆర్డీఏ కార్యాలయం	8,13,215
ఆర్డీఏ కార్యాలయం	7,48,604
పంచాయతీరాజ్ కార్యాలయం	7,27,365
డిప్యూటీ ఈఈ పంచాయతీరాజ్	7,15,688
కోల్డ్ స్టోరేజీ మిల్క్	6,96,699
రూరల్ పోలీస్‌స్టేషన్	6,35,774
ఎక్సైజ్ కార్యాలయం	5,90,692
పోలీస్‌స్టేషన్ వన్‌టౌన్	4,84,029
డీఎస్పీ కార్యాలయం	4,26,519
కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు.....	
బీఎస్ఎన్ఎల్ కార్యాలయం	54,74,461
పీఎఫ్ కార్యాలయం	1,90,031
టెలికాం క్వార్టర్స్	7,947

వరి మడులలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

● డీఏవో స్వరూపరాణి



చిన్నకోడూరు మండలం చౌడారంలో వరి పంటను పరిశీలిస్తున్న డీఏవో స్వరూపరాణి తదితరులు

సిద్దిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరికి చీడ పీడలు, వ్యాధులు సోకకుండా రైతులు నివారణకు వరి మడులలో కాలువలు చేసి నీరు నిల్వ ఉండకుండా బయటికి పంపించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూప రాణి సూచించారు. చిన్నకోడూరు మండలంలోని చౌడారంలో రైతులు సాగు చేసిన వరి పంటలను శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేసి మాట్లాడారు. పాల దశలోని వరిని కంకినల్లి ఆశించే అవకాశం ఉన్నందున స్పైరోమెసిఫెన్ 1మీ.లీలీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. రైతులు వరి, మొక్కజొన్న పంటలను కోసిన తర్వాత మిగిలిన అవశేషాల (కొయ్యల)ను కాల్చవద్దని దాని వల్ల భూసారం తగ్గడంతో పాటు, పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటుందన్నారు. పత్తి పంట సాగు చేసిన రైతులు పంటను విక్రయించడానికి కాపాస్ కిసాన్ యాప్‌లో తమ వివరాలు నమోదు చేయించుకోని స్లాట్ బుక్ చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో జయంత్ కుమార్, ఏఈవో జమీల్ అహ్మద్, రైతులు పాల్గొన్నారు.